# ధన్యులు

ధన కనక వాహనాలను కలిగి వుండడాన్ని లేక అంతా బాగుందనే భావననే నేడు అనేకులు ధన్యత అనుకుంటుంటారు. అయితే, కీర్తనలు గ్రంథంలోనూ బైబిల్లోని యితర చోట్ల ధన్యత అంటే దేవుడిచ్చే మేళ్ళను పొందడంతోబాటు ఆయన కోరుకున్నట్లు జీవించడమనే అర్థం కూడ స్ఫురిస్తుంది.

సిరిసంపదలు కలిగివుండడం ధన్యతే, తినడానికి తిండి వుండడానికి యిల్లు చక్కని కుటుంబం - యివన్నీ దేవుని దీవెనలే (కీర్తన 127:3: 128:4,5:144:12-15). యివన్నీ దేవుడు యిచ్చేదే. ఏ లోటు లేకుండా బ్రతకాలంటే యివి కావల్సిందే. అయితే, ప్రధానమైనది మరొకటి వుంది. దేవునితో సత్ సంబంధం కలిగివుండడం మనిషి జీవితంలో అన్నిటి కంటే ముఖ్యం దేవుని ఉపదేశాలకు లోబడి ఆయన కిష్టమైనట్లు జీవించడంలోనే నిజమైన సంతోషం వుంది. ధన్యత లేక ఆశీర్వాదం అంటే అసలు యిదే (కీర్తన 1:1,2:119:1,14:174).

ఈ కారణంగానే జీవితంలో ఎన్ని కష్టాలు కడగండ్లు ఎదురైనప్పటికీ కీర్తనకారులు సంతోషంతో వుండగలిగారు. చాలా కీర్తనలు సహాయం కొరకు చేసిన ప్రార్థనలే. ఈ ప్రార్థనల్లో కీర్తనకారులు తమను యితరులు అణచివేస్తున్నారని శత్రువులు తమను నిందిస్తున్నారని శ్రమలు శోధనలు తమను చుట్టముట్టివున్నాయని పిర్యాదు చేయడం మామూలే, అయినా, కీర్తనకారులు ఎంతో సంతోషంగా వుండడానికి కారణం ఆయనను ఆశ్రయించు వారందరు ధన్యులు (కీర్తన 2:12) అంటూ వారు దేవుణ్ణి నమ్మడమే. యిలాంటి నమ్మకం దేవునితో సత్‌సంబంధం కలిగివున్నప్పుడే వుంటుంది. ఈ సంతోషమే వారు యిష్టపూర్వకంగా దేవునికి లోబడేలా బీదలను ప్రేమించేలా చేస్తుంది. (కీర్తన 41:1,2) 112:1-4). దేవుడు అబ్రాహాంతో వాగ్దానం చేసిన విధంగా, వీరు యితరులకు కూడ ఆశీర్వాద కారణమౌతారు (ఆది 12:1-3).

ఈ ధన్యత (ఆశీర్వాదం లేక పుణ్యం) గురించే యేసు మాట్లాడారు. మనుషులు తమ కిష్టం వచ్చినట్లు చేయడం కాదు. వారి మనస్సు మారాలి.(మత్తయి 4:17). యిలా జీవించడంలో శ్రమలుంటాయని యేసుకు ఆయన శిష్యులకు తెలుసు (మత్తయి 16:21-24). అయితే, దేవుడు కోరిన విధంగా జీవించడమే నిజమైన ధన్యత. నా నిమిత్తము జనులు మిమ్మును నిందించి మీమీద అబద్ధముగా చెడ్డమాటలెల్ల పలుకునప్పుడు మీరు ధన్యులు అని యేసు చెప్పాడు (మత్తయి 5:11). సహాయం కొరకు చేసిన ప్రార్థనల్లో (కీర్తనల్లో)కీర్తనకారులు నిందలను హింసలను అవమానాలను యెదుర్కొన్నట్లు కన్పిస్తుంది. (కీర్తన 9:13:13:4:17:9:109:2-5). అయితే, దేవుడు బాధ ననుభవించేవారివైపు వుంటాడు గనుక నిజమైన సంతోషం అంటే ఏమిటో వారికి తెలుసు (కీర్తన 119.92).